ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 తమిళనాడు TAMILNADU
సోమవారం 26 ఫిబ్రవరి 2024

తిరుచెందూరు, కడలూరులో

వైభవంగా మాసిమఖం తెప్పోత్సవాలు



తిరుచెందూరు తీర్థకొలనులో తెప్పపై ఊరేగుతున్న వళ్లీ, దేవసేన సమేత కుమారస్వామి

చెన్నై, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మాసి మఖం ఉత్సవాల్లో భాగంగా తిరుచెందూరు, కడలూరుల్లో శనివారం రాత్రి తెప్పోత్సవాలు కనులపండువగా జరిగాయి. కుమారస్వామి కొలువైన ఆరు దివ్యక్షేత్రాల్లో ద్వితీయ క్షేత్రంగా ఉన్న తిరుచెందూరు ఆలయంలో మాసిమఖం ఉత్సవాలు ఈనెల 14న ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రథోత్సవం వైభవంగా జరిగింది. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి సెందిల్ ఆండవర్ తెప్పోత్సవం నిర్వహించారు. తెప్పపై ఏర్పాటు చేసిన అందమైన పందిరిలో వళ్లీ, దేవసేన సమేతుడైన కుమారస్వామి ఆశీనులయ్యారు. మంగళవాయిద్యాలు, బాణసంచా వేడుకల నడుమ ఆ తెప్పను 11 సార్లు కొలనులో తిప్పారు. ఈ వేడుకల్లో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. ఇదే విధంగా కడలూరు ముత్తునగర్‌లో శనివారం రాత్రి తెప్పోత్సవాలు జరిగాయి. ముత్తునగర్ చుట్టుపక్కల ఉన్న జాలర్ల కుప్పాల్లో ఉన్న ఆలయాలలోని ఉత్సవమూర్తులందరినీ విద్యుద్దీపాలతో వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన పడవలపై ఊరేగించారు. కడలితీరంలో పడవలపై ఊరేగుతున్న వివిధ ఆలయాల ఉత్సవమూర్తులను భక్తులు దర్శించుకున్నారు. ఈ వేడుకలు ఆదివారం వేకువజాము వరకూ కొనసాగాయి. తైక్కాల్‌కోనితురై సెంగై అమ్మన్, సోనాంకుప్పం వెంకటేశపెరుమాళ్, సింగారతోప్పు వెళ్లరియమ్మన్ ఆలయం, సలంగైకార వీధి నాగముత్తు మారియమ్మన్ ఆలయం, ఆంట్రగరై వీధి ఏళై ముత్తుమారియమ్మన్, అంకాళపరమేశ్వరి ఆలయం, కన్నూరు మారియమ్మన్ ఆలయాలకు చెందిన ఉత్సవమూర్తులతో జరిగిన ఈ తెప్పోత్సవాలను వీక్షించి భక్తులంతా పారవశ్యం చెందారు.

రూ.4వేల కోట్లతో విన్‌ఫాస్ట్ ఫ్యాక్టరీ

తూత్తుకుడిలో శంకుస్థాపన చేసిన సీఎం

చెన్నై, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా సిప్కాట్- సిలానత్తం పారిశ్రామికవాడలో వియత్నాంకు చెందిన విన్‌ఫాస్ట్ ఆటో లిమిటెడ్ సంస్థ రూ.4వేల కోట్లతో నెలకొల్పనున్న ఎలక్ట్రికల్ వాహనాల (ఈవీ) ఉత్పత్తి కర్మాగారానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ భూమిపూజ, శంకుస్థాపన చేశారు. తూత్తుకుడి జిల్లాలో విన్‌ఫాస్ట్ సంస్థ రూ.15వేల కోట్లతో పరిశ్రమలు ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాలు కుదుర్చుకుంది. ఆ ప్రాజెక్టులో భాగంగా తొలిదశలో 3500 మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి అవకాశాలు కల్పించే రీతిలో ఎలక్ట్రికల్ వాహనాల ఉత్పత్తి కర్మాగారాన్ని నిర్మించనుంది. ఆ మేరకు ఆదివారం ఉదయం సిప్కాట్ - సిలానత్తం పారిశ్రామికవాడలో ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యమంత్రి స్టాలిన్ ఈ కర్మాగారానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ... వాహనాల ఉత్పత్తులకు సంబంధించి ఇంత భారీ పెట్టుబడులతో ఎలక్ట్రికల్ వాహనాల తయారీ కర్మాగారం ప్రారంభించడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. దక్షిణ తమిళనాట ఈ కర్మాగారం ఉత్పత్తులు ప్రారంభిస్తే దేశంలోనే ప్రత్యేక ఆటో హబ్‌గా, భారతదేశ ఈవీల రాజధానిగా పేరుగడించడం ఖాయమన్నారు. తూత్తుకుడి సిప్కాట్‌లో ఏర్పాటు కానున్న విన్‌ఫాస్ట్ కర్మాగారంలో యేడాదికి 1.5లక్షల వాహనాలను ఉత్పత్తి చేయనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ ఎం.అప్పావు, మంత్రులు కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, తంగం తెన్నరసు, గీతాజీవన్, అనితా రాధాకృష్ణన్, ఆర్ఎస్ రాజకన్నప్పన్, మనో తంగరాజ్, టీఆర్‌బీ రాజా, తూత్తుకుడి ఎంపీ కనిమొళి, శాసన సభ్యులు సి.షణ్ముఖయ్య, జీవీ మార్కండేయన్, ఊర్వశి ఎస్ అమృతరాజ్, తూత్తుకుడి మేయర్ పి.జగన్, పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహక శాఖ కార్యదర్శి వి.అరుణ్‌రాయ్, మార్గదర్శక సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వి.విష్ణు, సిప్కాట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కే.సెంథిల్ రాజ్, తూత్తుకుడి జిల్లా కలెక్టర్ కే.లక్ష్మీపతి, విన్‌ఫాస్ట్ ఇండియా సంస్థ సీఈఓ పామ్‌సాన్‌హ చౌ, ఉపాధ్యక్షులు హోంగ్ కాంగ్ తంగ్ తదితరులు పాల్గొన్నారు.



తూత్తుకుడి జిల్లా సిప్కాట్- సిలానత్తం పారిశ్రామికవాడలో విన్‌ఫాస్ట్ ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తి కర్మాగారానికి శంకుస్థాపన చేస్తున్న సీఎం స్టాలిన్

విజయధరణి రాజీనామా ఆమోదం

- స్పీకర్ అప్పావు ప్రకటన



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ అప్పావు

చెన్నై, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ శాసనసభ్యురాలు విజయధరణి రాజీనామాను ఆమోదించినట్లు శాసనసభ స్పీకర్ అప్పావు ప్రకటించారు. ఆదివారం ఉదయం ఆయన తూత్తుకుడిలో విలేకరులతో మాట్లాడుతూ... విజయధరణి ఈమెయిల్ ద్వారా పంపిన రాజీనామా పత్రం తన కార్యాలయానికి అందిందని చెప్పారు. ఈ విషయమై ఆమెతో ఫోన్ చేసి మాట్లాడానని, కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరినందువల్ల తన రాజీనామాను ఆమోదించాలని విజ్ఞప్తి చేశారని తెలిపారు. అయితే బీజేపీలో చేరిన విజయధరణిపై పార్టీ ఫిరాయింపుల చట్టం ప్రకారం టీఎన్‌సీసీ నేత సెల్వపెరుందగై చేసిన ఫిర్యాదు గురించి విలేకరులు అడిగిన ప్రశ్నకు అప్పావు బదులిస్తూ... ఆమె పంపిన రాజీనామాను ఆమోదించడంతో ఇతర చర్యలకు తావులేదని భావిస్తున్నట్లు తెలిపారు. శాసనసభ కార్యదర్శి ఈ విషయమై త్వరలో కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాయనున్నారని, ఆ తర్వాత ఎన్నికల సంఘం విజయధరణి ప్రాతినిథ్యం వహించిన విలవంగోడు శాసనసభ నియోజకవర్గం ఖాళీ పడినట్లు ప్రకటన జారీ చేస్తుందన్నారు.

లోక్‌సభ ఎన్నికలతోపాటే ఉపఎన్నిక...

ఇదిలా ఉండగా కన్నియాకుమారి జిల్లా విలవంగోడు నియోజకవర్గం శాసనసభ్యురాలు విజయధరణి రాజీనామా చేయడంతో ఆ నియోజకవర్గానికి ఉపఎన్నిక జరగనుంది. లోక్‌సభ ఎన్నికలతోపాటే ఈ ఉప ఎన్నిక జరుగుతుందని ఎన్నికల సంఘం అధికారులు చెబుతున్నారు. విలవంగోడు ఉపఎన్నికలో ఈసారీ త్రిముఖ పోటీ ఏర్పడనున్నట్లు తెలుస్తోంది. డీఎంకే కూటమిలోని కాంగ్రెస్, అన్నాడీఎంకే, బీజేపీ ఈ నియోజకవర్గంలో తమ అభ్యర్థులను బరిలోకి దింపనున్నాయి.

బీజేపీకి వ్యతిరేకంగా

మార్చి నుంచి కరపత్రాల ప్రచారం

- టీఎన్‌సీసీ చీఫ్ సెల్వపెరుందగై

ప్యారీస్, ఫిబ్రవరి 25: పదేళ్ల ప్రజా వ్యతిరేక బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వచ్చే మార్చి నుంచి రాష్ట్రవ్యాప్తంగా కరపత్రాలతో ప్రచారం చేపట్టనున్నట్లు తమిళనాడు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సెల్వపెరుందగై ప్రకటించారు. రాయపేటలోని టీఎన్‌సీసీ ప్రధాన కార్యాలయం సత్యమూర్తి భవన్‌లో ఆదివారం లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి పార్టీ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై సెల్వపెరుందగై పార్టీ సీనియర్ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... ప్రధాని నరేంద్రమోదీ ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చకుండా కులమతాల వారీగా విడదీసి రాజకీయ లబ్ధిపొందేలా వ్యవహరిస్తున్నారన్నారు. పదేళ్ల బీజేపీ పాలనలో దేశం ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుందని, గత డిసెంబరు వరకు నిర్వహించిన సర్వేలో కేంద్ర బీజేపీ ప్రభుత్వ రుణభారం రూ.172 లక్షల కోట్లుగా తేలిందన్నారు. అయితే 1947 నుంచి 2014 వరకు 67 ఏళ్లలో కాంగ్రెస్ సహా యూపీఏ సంకీర్ణ ప్రభుత్వాలు అధికారంలో ఉన్న సమయంలో పొందిన మొత్తం రుణాలు రూ.55 లక్షల కోట్లు మాత్రమనని తెలిపారు. లోక్‌సభకు త్వరలో జరుగనున్న ఎన్నికల్లో మూడోసారి అధికారంలోకి రావాలన్న పట్టుదలతో రాజకీయ చక్రం తిప్పుతున్న మోదీ ప్రభుత్వ అవినీతి అక్రమాలపై ముద్రించిన కరపత్రాలతో మార్చి మొదటి వారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పర్యటించి ప్రచారం చేపట్టనున్నట్లు సెల్వపెరుందగై తెలిపారు.



సత్యమూర్తి భవన్‌లో సెల్వ పెరుందగైను సత్కరిస్తున్న నిర్వాహకులు

ప్రధాని పర్యటనకు భారీ భద్రతా ఏర్పాట్లు

నెల్లై, తిరుప్పూర్ జిల్లాల్లో డ్రోన్ల సంచారంపై నిషేధం ● హెలికాప్టర్ ట్రయల్ రన్ ● అడుగడుగునా తనిఖీలు





హెలికాప్టర్ ట్రయల్ రన్ - పోలీసుల వాహన తనిఖీలు

ప్యారీస్, ఫిబ్రవరి 25: ప్రధాని నరేంద్ర మోదీ రెండు రోజుల పర్యటన కోసం ఈనెల 27, 28 తేదీల్లో రాష్ట్రానికి రానున్న నేపథ్యంలో తిరునెల్వేలి, తిరుప్పూర్ జిల్లాల్లో డ్రోన్ల సంచారాన్ని నిషేధించారు. తిరునెల్వేలి సమీపంలోని పల్లడంలో ప్రధాని కోసం ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌పై ఆదివారం ఉదయం వైమానిక విభాగం అధికారులు ట్రయల్ రన్ నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై చేపట్టిన 'ఎన్ మన్...ఎన్ మక్కల్' పాదయాత్ర ముగింపు బహిరంగ సభ పల్లడంలో ఈనెల 27న జరగనుంది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు కేరళ నుంచి కోయంబత్తూర్ జిల్లాలో ఉన్న సూలూరు వైమానిక దళానికి చేరుకొనే ప్రధాని, అక్కడి నుంచి హెలికాప్టర్ ద్వారా బహిరంగ సభ నిర్వహించనున్న మాదాపూర్ గ్రౌండ్‌కు చేరుకుంటారు. ఇందుకోసం ఏర్పాటుచేస్తున్న హెలిప్యాడ్‌ను సూలూరు చెందిన వైమానికదళ అధికారులు ట్రయల్ రన్ నిర్వహించారు. అనంతరం ప్రధాని పాల్గొనే బహిరంగ సభ ప్రాంగణాన్ని ఎస్పీజీతో కలసి స్థానిక పోలీసులు అడుగడుగునా క్షుణ్ణంగా తనిఖీ చేశారు. 28వ తేది తూత్తుకుడి హార్బర్‌లో జరగనున్న కులశేఖరపట్టినం రాకెట్ ప్రయోగ కేంద్రానికి ప్రధాని మోదీ శంకుస్థాపన చేస్తారు. ఆ రోజు ఉదయం 10.45 గంటలకు అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి పాళయంకోట జాన్స్ కళాశాల మైదానంలో దిగి కారులో బెల్ పాఠశాల గ్రౌండ్స్‌లో బీజేపీ తరఫున ఏర్పాటు చేసే బహిరంగసభలో పాల్గొంటారు. ప్రధాని పాల్గొనే ఈ రెండు కార్యక్రమాలు నిర్వహించే ప్రాంతాల్లో కోవై, ఈరోడ్, సేలం తదితర ఆరు జిల్లాలకు చెందిన 10,000 మందికి పైగా పోలీసులు భద్రతా విధుల్లో పాల్గొనాల్సిందిగా డీజీపీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో, ప్రధాని రాక సందర్భంగా ఈ రెండు జిల్లాల్లో హోటళ్లు, మాన్షన్లు, లాడ్జీల్లో తనిఖీలు ప్రారంభించారు. భవన నిర్మాణ పనుల్లో పాల్గొంటున్న వలస కార్మికుల వివరాలను స్థానిక, క్యూ బ్రాంచ్ పోలీసులు సేకరిస్తున్నారు. ప్రధాని పాల్గొనే వేదిక ప్రాంతాలను, హెలిప్యాడ్ వద్ద సుమారు 50కి పైగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతాలవద్ద 24 గంటలు షిఫ్టు పద్ధతిలో పోలీసులు పర్యవేక్షిస్తున్నారు.

త్వరలో జయ 28 కిలోల బంగారు నగల వేలం



చెన్నై, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అక్రమార్జన కేసులో బెంగళూరు ప్రత్యేక కోర్టు విధించిన జరిమానా సొమ్ము రూ.100 కోట్ల వసూలు దిశగా మాజీ ముఖ్యమంత్రి జయలలితకు చెందిన 28 కిలోల బంగారు నగలను వేలం వేయడానికి రంగం సిద్ధమైంది. ఆ నగలను వేలం ద్వారా రూ.40 కోట్లకు విక్రయించనున్నారు. మిగతా రూ.60కోట్లను ఆమె స్థిరాస్థులను విక్రయించి వసూలు చేయనున్నారు. 2014లో బెంగళూరు ప్రత్యేక కోర్టు అక్రమార్జన కేసులో జయలలితకు నాలుగేళ్ల జైలు శిక్ష, రూ.100కోట్ల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. ఆ తర్వాత సుప్రీంకోర్టు ప్రత్యేక కోర్టు తీర్పును ఖరారు చేసింది. జయ మృతి చెంది ఆరేళ్లవుతున్నా జరిమానా సొమ్మును వసూలు చేయలేకపోయారు. ఈ పరిస్థితుల్లో జయకు చెందిన విలువైన బంగారు ఆభరణాలను విక్రయించి, స్థిరాస్తులలో కొంత భాగాన్ని వసూలు చేసి రూ.100 కోట్ల జరిమానా సొమ్మును వసూలు చేయాలని అధికారులు నిర్ణయించారు. అవినీతి నిరోధక విభాగం (ఏసీబీ) అధికారులు జయ నివాసగృహం నుంచి స్వాధీనం చేసుకున్న 28 కిలోల బంగారు నగలు, 800 కిలోల వెండి ఆభరణాలను కోర్టుకు సమర్పించారు. ఆ నగలను వేలం ద్వారా విక్రయించనున్నారు. బెంగళూరు కోర్టులో ఉన్న ఆ నగలను మార్చి 6 లేదా 7వ తేదీన చెన్నైకి తీసుకురానున్నారు. ఆ తర్వాత ప్రభుత్వ ఖజానాలో వాటిని ఉంచి వేలం ద్వారా విక్రయించనున్నారు. జరిమానా సొమ్ము రూ.100కోట్లతోపాటు బెంగళూరు కోర్టు విచారణ ఫీజుల రూపంలో రూ.5కోట్లను కర్ణాటక ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంది. ఈ సొమ్ముకు కూడా జయ స్థిరాస్థులను విక్రయించి రాబట్టాలని అధికారులు భావిస్తున్నారు.


ప్రబంధ యుగంలో కడపటి కాంతిదీపం సారంగు తమ్మయ్య

- డాక్టర్ ఆకెళ్ళ విభీషణశర్మ

చెన్నై, ఫిబ్రవరి 25: ప్రబంధ యుగంలో కడపటి కాంతిదీపం సారంగు తమ్మయ్య అని తిరుమల తిరుపతి దేవస్థానం అన్నమయ్య ప్రాజెక్టు సంచాలకుడు బ్రహ్మశ్రీ డాక్టర్ ఆకెళ్ళ విభీషణశర్మ అన్నారు. వేద విజ్ఞాన వేదిక సభకు వక్తగా విచ్చేసిన ఆయన సంస్థ 146వ ప్రసంగంగా 'సారంగు తమ్మయ్య రచించిన 'వైజయంతీ విలాసం'పై ఉపన్యసించారు. స్థానిక టి.నగర్‌లోని ఆస్కా కృష్ణాహాలులో ఆదివారం సాయంత్రం ఏర్పాటైన ఈ కార్యక్రమానికి నగర ప్రముఖులు, సాహితీ అభిమానులు విచ్చేశారు. అరుణా శ్రీనాథ్ ప్రార్థనతో సభ ప్రారంభమైంది. వేదవిజ్ఞాన వేదిక కార్యదర్శి కందనూరు మధు స్వాగతోపన్యాసం చేశారు. వక్తను పరిచయం చేస్తూ ఆకెళ్ళ విభీషణశర్మ... శిక్షా శాస్త్రి, వేదవాచస్పతి, ఆలయ సంస్కృతిలో పీజీ డిప్లొమా మొదలైన డిగ్రీలు పొందారని, ఎన్నో కళాశాలల్లో పత్ర సమర్పణ చేశారని, వెంకటేశ్వర స్తోత్ర విలాసం, వ్యాస షోడసి, తిరుపతి చరిత మొదలైన 14 గ్రంథాలను రచించారని పేర్కొన్నారు. దేశవిదేశాల్లోనూ ప్రవచనాలు చేశారని, ఎస్వీబీసీ ఛానెల్‌లో సుందరకాండ గురించి అద్భుతంగా విశదీకరించారని తెలిపారు. అనంతరం విభీషణశర్మ ప్రసంగిస్తూ... విప్రనారాయణుడు ఆళ్వార్ అని, ఆయన వైజయంతీ మాల అంశతో జన్మించారని, తండ్రి నారాయణుడు, తల్లి లక్ష్మి అని మన్నార్‌గుడి అగ్రహారంలో జన్మించారని తెలిపారు. విప్రనారాయణుడి కథే వైజయంతీ విలాసం అని చెప్పారు. విప్రులలో మణిభూసవంటివాడని, వినయంబు మూర్తీభవించినట్లు ఉండేవారని, అష్టాక్షరీ మంత్ర జపం సదా చేసేవాడని విప్రులు నారాయణుడిని గురించి అనుకునేవారని చెప్పారు. నారాయణుడికి ఇష్టమైన పూలను మాలలుగా సమర్పించాలని తలచి తానే ఆ పూల చెట్లను పెంచి ఆ మాలలతో దేవుడికి సమర్పించేవాడని తెలిపారు. రాజాస్థానంలో దేవదేవి, మధురవాణి అనే నర్తకీమణులు ఉండేవారని, ఓసారి ఆ ఇరువురూ నారాయణుడి ఆశ్రమానికి వెళ్ళారని, ఆయన పెంచిన పుష్పవనాన్ని శ్లాఘించి నమస్కరించగా ఆయన దృష్టివారిపై పడలేదని చెబుతూ 'మ్రొక్కిన నెవ్వరేమనడు, మోమటు వెట్టుక చక్క బోయె నీ దిక్కుని చూడడాయె' అని దేవదేవి కోపంతో మధురవాణితో అన్నదని పేర్కొన్నారు. అయిదు ఆశ్వాసాల వైజయంతీ విలాసంలో ఋతువర్ణన, అంధకార వర్ణన సారంగు తమ్మయ్య గొప్పగా వర్ణించారని వక్త అన్నారు. దేవదేవి విప్రనారాయణుడిని విటునిగా మార్చే ప్రయత్నంలో ఆయన ఆశ్రమానికి ఏతెంచి సేవలు గావించి అతనిని వశపరచుకొన్నదని, ఆ కథనంతా వక్త వివరించారు. పూర్వ కర్మల వల్ల విప్రనారాయణుడు కారాగార వాసం చేశాడని, పరమాత్ముడిని విప్రనారాయణుడు ప్రార్థించగా చివరకు ఆయనకు రంగనాథ స్వామి ప్రత్యక్షమై మోక్షాన్ని ప్రసాదించారని తెలిపారు. విప్రనారాయణుడు వైజయంతీ మాల అంశవలన జన్మించినందున మాఘ పౌర్ణమి మరుసటి రోజున ఆయన నారాయణుడిలో ఐక్యమైనాడని తెలిపారు. ఈ కార్యక్రమం జరిగిన రోజునే ఇది జరిగినందున వైజయంతీ విలాసం గురించి చెప్పడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు.



సభకు విచ్చేసిన సాహితీ అభిమానులు, నగర ప్రముఖులు



ప్రసంగిస్తున్న విభీషణశర్మ

సమాచార దర్శిని

ఏప్రిల్ 23న టైప్‌రైటింగ్ పరీక్షా ఫలితాలు

పెరంబూర్, ఫిబ్రవరి 25: టైప్ రైటింగ్ పరీక్షా ఫలితాలు ఏప్రిల్ 23న విడుదల కానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 3,500 టైప్ రైటింగ్ శిక్షణ కేంద్రాలున్నాయి. రాష్ట్ర సాంకేతిక విద్య డైరెక్టరేట్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు యేటా జూనియర్ టైపింగ్, మాస్టర్ టైపింగ్ అని రెండు రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో, శనివారం 208 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన జూనియర్ టైపింగ్ పరీక్షకు 1.98 లక్షల మంది హాజరయ్యారు. మాస్టర్ టైపింగ్ పరీక్ష ఆదివారం జరగ్గా, ఈ రెండు పరీక్షా ఫలితాలు ఏప్రిల్ 23వ తేది విడుదల కానున్నట్లు ప్రకటన విడుదలైంది.

దక్షిణ జిల్లాల రైతులకు రూ.201 కోట్ల వరద సాయం

పెరంబూర్, ఫిబ్రవరి 25: దక్షిణ జిల్లాల రైతులకు రూ.201.67 కోట్ల వరదసాయం అందించేలా ప్రభుత్వం జీవో విడుదల చేసింది. డిసెంబరు 17, 18 తేదీల్లో కురిసిన భారీవర్షాల కారణంగా కన్నియాకుమారి, తూత్తుకుడి, తిరునల్వేలి, తెన్‌కాశి, విరుదునగర్, మదురైతదితర ఆరు జిల్లాలు తీవ్రనష్టాన్ని చవిచూశాయి. ఈ కారణంగా బాధిత జిల్లాలకు చెందిన 2.60 లక్షల మంది రైతులకు పంట పరిహార ఆర్థికసాయం అందించాలని రాష్ట్రప్రభుత్వం పేర్కొంది. అలాగే, రామనాథపురం, శివగంగ జిల్లాల రైతులకు పరిహారం అందించేలా జీవో విడుదలైంది. పరిహారం రైతుల బ్యాంక్ ఖాతాల్లో సత్వరం చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించింది.

500 ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలుకు టెండర్ల ఆహ్వానం

పెరంబూర్, ఫిబ్రవరి 25: నగరంలో ఎలక్ట్రిక్ బస్సులు నడిపేలా మెట్రో ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) 500 బస్సుల కొనుగోలుకు టెండర్లు ఆహ్వానిస్తోంది. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పరిధిలోని 700 మార్గాల్లో ప్రతిరోజు 3,454 బస్సులు నడుపుతుండగా 30.50 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. ప్రయాణికుల రద్దీ నియంత్రించేలా బస్సుల సంఖ్య పెంచాలని ఎంటీసీ నిర్ణయించింది. ఇదివరకే 100 ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలుకు టెండర్లు ఆహ్వానించిన ఎంటీసీ, తాజాగా మరో 500 బస్సులకు టెండర్లు ఆహ్వానించినట్లు ఎంటీసీ ఒక ప్రకటనలో తెలిపింది.

అయోధ్య రామాలయాన్ని సందర్శించిన 1.50 లక్షల మంది

పెరంబూర్, ఫిబ్రవరి 25: అయోధ్యల రామాలయాన్ని నెలరోజుల్లో 1.10 లక్షల మంది భక్తులు సందర్శించుకున్నారు. ఈ మేరకు బీజేపీ ఎన్విరాన్మెంట్ టీం అధ్యక్షుడు గోపినాథ్ మాట్లాడుతూ... రాష్ట్రంనుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దర్శనం పూర్తిచేసుకొని వెళ్లేలా తన నేతృత్వంలోని ఐదుగురితో కూడిన బృందం అయోధ్యలో ఉందన్నారు. కుంభాభిషేకం జరిగిన జనవరి 22 నుంచి ఈనెల 24వ తేదీ శనివారం వరకు చెన్నై, కోయంబత్తూర్, తిరునల్వేలి తదితర ప్రాంతాల నుంచి నడిపిన ప్రత్యేక రైళ్ల ద్వారా 1.50 లక్షల మంది భక్తులు రామలయ్యాన్ని సందర్శించారని తెలిపారు. అయోధ్య వచ్చే భక్తులు ఆయా జిల్లాల బీజేపీ నాయకుల ద్వారా తమ బృందాన్ని సంప్రదించాలని, వారికి అవసరమైన అన్ని వసతులు తాము కల్పిస్తామన్నారు. మార్చి 6వ తేది వరకు మాత్రమే తమ బృందం అయోధ్యలో ఉంటుందని గోపినాథ్ తెలిపారు.

1న అన్నాడీఎంకే నక్షత్ర ప్రచారకుల సమావేశం

పెరంబూర్, ఫిబ్రవరి 25: అన్నాడీఎంకే నక్షత్ర ప్రచారకుల సమావేశం మార్చి 1వ తేది జరగనుంది. పార్టీ ప్రధాన కార్యదర్శి ఈపీఎస్ ఉత్తర్వులతో ఎగ్మూర్ రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న హోటల్ ఇంపీరియల్ సిరాజ్ మహల్ లో ఉదయం 10 గంటలకు సమావేశం జరగనుంది. రాబోయే పార్లమెంటు ఎన్నికల ప్రచారంపై సమావేశంలో చర్చించనున్నట్లు పార్టీ పేర్కొంది.

29లోగా రేషన్‌లో వేలిముద్రల పరిశీలన పూర్తి

పెరంబూర్, ఫిబ్రవరి 25: రేషన్ సభ్యుల వాస్తవికత ధృవీకరించాలని కేంద్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అందుకోసం, రేషన్ దుకాణాల్లో ప్రాధాన్య, అంత్యోదయ కార్డుల్లోని ఒక్కో సభ్యుడి వేలిముద్రను 'ఆధార్' ద్వారా నిర్ధస్తున్నారు. రాష్ట్రంలో 18.61 అంత్యోదయ రేషన్‌కార్డులు, 95.66 లక్షల ప్రాధాన్య కార్డులున్నాయి. అంత్యోదయ విభాగంలో కార్డుకు నెలకు 35 కిలోల బియ్యం, ప్రాధాన్య విభాగంలో కార్డుల్లోని ఒక్కో సభ్యుడికి తలా 5 కిలోల బియ్యం ఉచితంగా అందిస్తున్నారు. ఈ బియ్యాన్ని కేంద్రప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తోంది. అంత్యోదయ కార్డుల్లో 65.46 లక్షల మంది, ప్రాధాన్య కార్డుల్లో 2.99 కోట్ల మంది లబ్ధిదారులున్నారు. ఇప్పటివరకు మొత్తం కార్డుల్లో 66 శాతం సభ్యుల వివరాలు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో, మిగిలిన సభ్యుల వేలిముద్రల పరిశీలన ఈ నెల 29వ తేదిలోపు పూర్తిచేయాలని, అందుకోసి కార్డుదారుల ఇళ్లకే బయోమెట్రిక్ పరికరం తీసుకెళ్లి వేలిముద్రలు పరిశీలించాలని రేషన్ సిబ్బందికి ఆహార భద్రతా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

కారైక్కాల్ ప్రభుత్వ వైద్యకళాశాల ప్రారంభించిన ప్రధాని

పెరంబూర్, ఫిబ్రవరి 25: కారైక్కాల్‌లో నిర్మించిన జిప్మర్ వైద్యకళాశాలను ప్రధానమంత్రి నరంద్ర మోదీ ప్రారంభించారు. రూ.491 కోట్ల వ్యయంతో జిప్మర్ వైద్యకళాశాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాని ప్రారంభించారు. అలాగే, పుదుచ్చేరి రాష్ట్రం యానాంలో రూ.91 కోట్లతో నిర్మించిన మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని కూడా మోదీ ప్రారంభించారు. కారైక్కాల్‌లో జరిగిన ప్రారంభోత్సవాల్లో పుదుచ్చేరి గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్, ముఖ్యమంత్రి రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

మద్యం బానిసలను విముక్తి చేయడమే ప్రధానం

● మంత్రి ముత్తుస్వామి

పెరంబూర్, ఫిబ్రవరి 25: టాస్మాక్ దుకాణాలు మూసివేయడం కన్నా మద్యం బానిసలను విముక్తి చేయడమే ప్రధానమని మంత్రి ముత్తుస్వామి అన్నారు. ఈరోడ్‌లో ఆదివారం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ... ఒక ప్రాంతంలో మద్యం దుకాణం మూసివేస్తే మందుబాబులు ఇతర ప్రాంతాలకు వెళ్లి మద్యం కొనుగోలు చేస్తారన్నారు. అందువల్ల దుకాణాలు మూయడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. మద్యానికి బానిసైన వారికి తగిన కౌన్సెలింగ్ అందజేసి మాన్పించడమే ప్రధానమన్నారు. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు మంత్రి చెప్పుకొచ్చారు.

మోదీ ఇడ్లీ దుకాణానికి అపూర్వ స్పందన

చెన్నై, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేకేనగర్ (వెస్ట్) మునుసామి రోడ్డులో బీజేపీ కార్యకర్త నడుపుతున్న 'మోదీ ఇడ్లీ'కి అపూర్వ స్పందన లభిస్తోంది. ప్రతిరోజూ ఉదయం కార్మికులు, ఉద్యోగులు, మధ్యతరగతి కుటుంబీకులు, మహిళలు ఆ దుకాణానికి రూ.10 కి మూడు ఇడ్లీలను తిని సంతృప్తిని వ్యక్తం చేశారు. బీజేపీ సౌత్ చెన్నై జిల్లా శాఖ కోశాధికారి కేపీ నాగరాజన్ సహకారంతో జోనల్ కమిటీ నాయకుడు జి.గోపీనాథన్ ఈ ఇడ్లీ దుకాణాన్ని నడుపుతున్నారు. ఈ దుకాణంలో రూ.10లకు 3 ఇడ్లీలు, రూ.5కు వడను విక్రయిస్తున్నారు. శని, ఆదివారాలు తప్ప మిగిలిన రోజుల్లో ఉదయం 6 నుండి 8 గంటల వరకు ఈ దుకాణాన్ని నడుపుతున్నారు. ఈ విషయమై దుకాణ యజమాని గోపీనాథన్ మాట్లాడుతూ... గత యేడాది డిసెంబర్‌లో ప్రారంభించిన దుకాణానికి ప్రజల నుండి మంచి స్పందన లభిస్తోందన్నారు. ప్రతిరోజూ పార్శిళ్ల సహా 80మందికి సరిపోయేలా 280 ఇడ్లీలు విక్రయిస్తున్నానని చెప్పారు. సేవాభావంతో దుకాణాన్ని నడుపుతున్నానని తెలిపారు. దుకాణం ప్రారంభించిన తొలినాళ్లలో విక్రయాలు తక్కువగా ఉండేవని... ఆ తర్వాత నాణ్యమైన ఇడ్లీలు, వడలు విక్రయిస్తున్నట్లు తెలుసుకుని ఉద్యోగులు, కార్మికులు, పేదలు దుకాణం వద్ద బారులు తీరారని చెప్పారు. త్వరలోనే విరుగంబాక్కం శాసనసభ నియోజకవర్గంలో పది ప్రాంతాల్లో మోదీ ఇడ్లీ దుకాణాలను ప్రారంభిస్తానని గోపీనాథన్ చెప్పారు. నగరంలో అమ్మా క్యాంటీన్లు మునుపటిలా సక్రమంగా నడపకపోవడం వల్లే మోదీ ఇడ్లీ దుకాణంలో విక్రయాలు పెరుగుతున్నాయని చెప్పారు.



మోదీ ఇడ్లీ షాపు వద్ద ఇడ్లీలు తింటున్న వృద్ధ మహిళలు

అభివృద్ధి పనుల పరిశీలన


చూళై ఎలిఫెంట్‌గేట్ వద్ద రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా

చెన్నై, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఆధ్వర్యంలో నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్‌మీనా ఆదివారం ఉదయం అధికారులతో కలిసి పరిశీలించారు. రాయపురం జోన్ 57వ వార్డులో ఎలిఫెంట్‌గేట్ రహదారిలో రూ.30.78 కోట్లతో నిర్మిస్తున్న రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణ పనులను, అలందూరు జోన్ 157వ వార్డులో రివర్ వ్యూ కాలనీలో నీటి వనరుల శాఖ ఆధ్వర్యంలో రూ.24.08 కోట్లతో వాన నీటి కాల్వ నిర్మాణ పనులను, అడయార్ జోన్ వేళచ్చేరి మెయిన్ రోడ్డులో రహదారుల శాఖ ఆధ్వర్యంలో రూ.4 కోట్లతో నిర్మిస్తున్న కొత్త రహదారి నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఆయనతోపాటు కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ జె.రాధాకృష్ణన్, రహదారుల శాఖ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌యాదవ్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ జీఎస్ సమీరాన్ తదితరులు పర్యటించారు.

జయలలిత సేవలు మరువలేనివి

● ద్రావిడ దేశం కృష్ణారావు


జయ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రి సోమసుందరం, కృష్ణారావు

ప్యారీస్, ఫిబ్రవరి 25: సినీ, రాజకీయ రంగాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందిన దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత సేవలు మరువ లేనివని ద్రావిడ దేశం పార్టీ వ్యవస్థాపకుడు ఒంటెల కృష్ణారావు పేర్కొన్నారు. జయలలిత 76వ జయంతి సందర్భంగా కాంచీపురం జిల్లా అన్నాడీఎంకే ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం జరిగింది. ముఖ్యఅతిథిగా కృష్ణారావు పాల్గొని, మాజీ మంత్రి సోమసుందరం, మాజీ ఎంపీ కాంచి పన్నీర్‌సెల్వం, మాజీ ఎమ్మెల్యే వాలాజాబాద్ గణేశ్‌తో కలసి జయ చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం అన్నదానాన్ని ప్రారంభించిన కృష్ణారావు మాట్లాడుతూ... నీట్, జీఎస్‌టీ సహా కేంద్రప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ముఖ్యమంత్రిగా జయలలిత వ్యవహరించిన సమయంలో ధైర్యంగా అడ్డుకున్నారని గుర్తు చేశారు.

లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకేదే విజయం

● ప్రచార విభాగ రాష్ట్ర కార్యదర్శి కల్యాణసుందరం


ఎంకేబీనగర్ అన్నాడీఎంకే బహిరంగ సభలో మాట్లాడుతున్న కల్యాణసుందరం

ప్యారీస్, ఫిబ్రవరి 25: పార్లమెంటుకు జరగబోయే ఎన్నికల్లో ప్రజా సమస్యలపై గళం విప్పుతున్న అన్నాడీఎంకే అన్ని స్థానాల్లో ఘనవిజయం సాధిస్తుందని ఆ పార్టీ ప్రచార విభాగ రాష్ట్ర కార్యదర్శి కల్యాణసుందరం ధీమా వ్యక్తం చేశారు. ఉత్తర చెన్నైలో జిల్లా అన్నాడీఎంకే కార్యదర్శి ఆర్ఎస్ రాజేష్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఎంకేబీ నగర్‌లో జయలలిత పేరవై ఆధ్వర్యంలో బహిరంగసభ జరిగింది. పేరవై కార్యదర్శి, మాజీ కౌన్సిలర్ డి.శరవణన్ సభకు అధ్యక్షత వహించారు. సభ అనంతరం జయ 76వ జయంతి సందర్భంగా 760 మంది పేదలకు సహాయాలు పంపిణీ చేశారు.

కేంద్రంపై అసత్య ప్రచారాలు

● వరదసాయంపై వానతి శ్రీనివాసన్

పెరంబూర్, ఫిబ్రవరి 25: తుఫాను, భారీవర్షాలకు అతలాకుతలమైన జిల్లాలకు కేంద్రప్రభుత్వం ఒక పైసా కూడా వరద సాయం అందించ లేదనే ఆరోపణల్లో వాస్తవం లేదని బీజేపీ ఎమ్మెల్యే వానతి శ్రీనివాసన్ తెలిపారు. కోవైలో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ... విపత్తు సంభవించిన వెంటనే కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, నిర్మలా సీతారామన్ స్వయంగా బాధిత ప్రాంతాలను పరిశీలించారన్నారు. అనంతరం కేంద్ర బృందాలను పంపి నష్టాని అంచనా వేయించారన్నారు. ఆ బృందం నివేదిక ఆధారంగా కేంద్రప్రభుత్వం ఆర్థికసాయం ప్రకటిస్తుందన్నారు. విపత్తు జరిగిన వెంటనే జాతీయ విపత్తు నివారణ నిధులను కేంద్రప్రభుత్వం అందజేసిందని, అవి డబ్బులు కావా? అంటూ ఆమె రాష్ట్రప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

కొండ ప్రాంతాల్లో మహిళలకు ఉచిత బస్సు సదుపాయం

● ఊటీలో ప్రారంభించిన మంత్రి శివశంకర్

ప్యారీస్, ఫిబ్రవరి 25: రాష్ట్రంలో కొండలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో నివసిస్తున్న మహిళలకు ఉచిత బస్సు సదుపాయం కల్పించినట్లు రాష్ట్రప్రభుత్వ రవాణా శాఖ మంత్రి ఎస్ఎస్ శివశంకర్ ప్రకటించారు. 2024-25వ సంవత్సరానికి సంబంధించి రాష్ట్రప్రభుత్వం బడ్జెట్‌లో పర్వతశ్రేణులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో నడుపుతున్న ప్రభుత్వ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణం చేసే పథకాన్ని అమలు చేయనున్నట్లు ప్రకటించారు. ఆ మేరకు ఆదివారం ఉదయం నీలగిరి జిల్లా ఊటీలో జరిగిన కార్యక్రమంలో మంత్రి శివశంకర్ ఈ పథకాన్ని ప్రారంభించారు. రాష్ట్ర అటవీ శాఖ మంత్రి రామచంద్రన్, డీఎంకే ఎంపీ ఎ.రాజా తదితరులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో మంత్రి శివశంకర్ మాట్లాడుతూ... నీలగిరి జిల్లాలో మహిళల ఉచిత ప్రయాణ పథకం కింద నడుపుతున్న 11 బస్సుల సంఖ్యను ఇక నుంచి 99గా పెంచుతున్నట్లు తెలిపారు. ఇక నుంచి ఈ పథకం ద్వారా కొండ ప్రాంతాలకు చెందిన మహిళలు 35 కి.మీ దూరం వరకు ఉచితంగా ప్రయాణించ వచ్చన్నారు.

పళవేర్కాడులో నీటి కాలుష్యానికి పక్షుల మృతి?


సరస్సు వద్ద పడి ఉన్న పక్షుల కళేబరాలు

చెన్నై, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళవేర్కాడు సరస్సు వద్ద నీటి కాలుష్యం కారణంగా పక్షులు మృతి చెందుతుండడం పట్ల పర్యాటకులు, జంతు ప్రేమికులు ఆందోళన చెందుతున్నారు. ఆ సరస్సు వద్దనున్న పక్షుల శరణాలయంలో 126 రకాలకు చెందిన స్వదేశీ, విదేశీ పక్షులు నివసిస్తున్నాయి. రెండు రోజులకు ముందు అన్నామలైచేరికి రెండు కి.మీ.ల దూరంలోని సరస్సులో కుళ్లిన స్థితిలో కొన్ని పక్షుల కళేబరాలు తీరానికి కొట్టుకువచ్చాయి. అటవీ శాఖ అధికారులు వాటిని స్వాధీనం చేసుకుని వైద్యపరీక్షల నిమిత్తం వాటిని నామక్కల్‌లోని ప్రయోగశాలకు పంపారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం కూడా కొన్ని పక్షుల కళేబరాలు తీరానికి కొట్టుకువచ్చాయి. ఆ సరస్సులో కాలుష్య పదార్థాలు అధికం కావటం వల్లే పక్షులు మృతి చెందుతున్నట్లు స్థానికులు, పర్యాటకులు అనుమానిస్తున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న రాష్ట్ర కాలుష్య నియంత్రణా మండలి అధికారులు ఆ సరస్సునీటిని సేకరించి పరీక్షలు జరిపేందుకు చర్యలు చేపడుతున్నారు.

రెండాకులు చిహ్నంపైనే పోటీ

● పళనిస్వామి అభ్యర్థులకు డిపాజిట్ గల్లంతు

● మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం


సభలో ప్రసంగిస్తున్న పన్నీర్‌సెల్వం

పెరంబూర్, ఫిబ్రవరి 25: ఎడప్పాడి పళనిస్వామి తరఫున పోటీ చేసే అన్ని నియోజకవర్గాల అభ్యర్థులకు డిపాజిట్లు దక్కవని మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం చెప్పారు. 'రెండాకులు' చిహ్నం కోసం ఎన్నికల కమిషన్‌ను సంప్రదిస్తున్నట్లు ఆయన తెలిపారు. పుదుచ్చేరికి చెందిన మద్దతుదారుడి ఇంటి శుభకార్యంలో ఆదివారం పాల్గొన్న అనంతరం ఓపీఎస్ విలేకరులతో మాట్లాడుతూ... తాము బీజేపీ కూటమిలో పదేళ్లుగా ఉన్నామన్నారు. ఇప్పటివరకు వచ్చిన కోర్టు తీర్పులతో పళనిస్వామికి తాత్కాలిక ఉపశమనం కలిగిందన్నారు. త్వరలో రానున్న తీర్పులు తమకే అనుకూలంగా ఉంటాయని ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో పళనిస్వామిని ఎవరూ నమ్మే స్థితి లేదన్నారు. మంచి చేసిన వారికి ద్రోహం చేసిన ఘనత ఆయనది అని అన్నారు. ప్రస్తుతం ఏఎంఎంకే ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్‌తో కలసి పని చేస్తున్నామన్నారు. భవిష్యత్తులో ఎడప్పాడి పళనిస్వామితో కలిసే ప్రసక్తే లేదన్నారు. పళనిస్వామి వర్గం చేస్తున్న విమర్శలకు అన్నామలై సరైన సమాధానం చెబుతున్నారన్నారు.

మతం పేరిట దేశం విచ్ఛిన్నం

● అన్నాడీఎంకే మాజీ మంత్రి సీవీ షణ్ముగం

పెరంబూర్, ఫిబ్రవరి 25: మతం పేరుతో దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు బీజేపీ యత్నిస్తోందని అన్నాడీఎంకే మాజీ మంత్రి సీవీ షణ్ముగం ధ్వజమెత్తారు. మరక్కాణంలో అన్నాడీఎంకే ఆధ్వర్యంలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో అన్ని మతాలు సమానంగా ఉన్నాయని, వారి సంప్రదాయాల ప్రకారం పూజలు, ప్రార్థనలు చేస్తున్నాయన్నారు. అలాంటి రాష్ట్రప్రజలను ఓటు అడిగే హక్కు బీజేపీకి లేదన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో అన్నాడీఎంకే ఆధ్వర్యంలో ఏర్పాటయ్యే కూటమి మెజార్టీ స్థానాల్లో విజయం సాధిస్తుందన్నారు. ఎన్నికల హామీలు నెరవేర్చని డీఎంకేపై ఆగ్రహంతో ఉన్న ప్రజలు, ఓటు ద్వారా ఆ పార్టీకి గుణపాఠం చెప్పనున్నారని సీవీ షణ్ముగం తెలిపారు.

తాంబరం మార్గంలో రైళ్ల రద్దు... సిటీ బస్సుల్లో పెరిగిన రద్దీ

చెన్నై, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మెట్రో రెండో విడత రైలు పట్టాల మరమ్మతుల కారణంగా తాంబరం మార్గంలో 44 ఎలక్ట్రిక్ రైళ్లను రద్దు చేయడంతో ఆ మార్గంలో వెళ్లే సిటీ బస్సుల్లో రద్దీ ఏర్పడింది. పలు చోట్ల ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ఉదయం 11 నుండి మధ్యాహ్నం 3.15 గంటల వరకు తాంబరం మార్గంలోని రైలు మార్గాలను రైల్వే ఇంజనీరింగ్ నిపుణులు, కార్మికులంతా కలిసి మరమ్మతులు చేపట్టారు. అదే సమయంలో తాంబరం మార్గంలో సిటీ బస్సులను చాలినంత నడపక పోవడంతో నగరవాసులు అవస్థలపాలయ్యారు. ఆదివారం తాంబరం మార్గంలో ఉన్న జంతు ప్రదర్శనశాల తదితర పర్యాటక ప్రాంతాలకు వెళ్లాలనుకున్న వారంతా ఇబ్బంది పడ్డారు. ప్యారీస్‌కార్నర్ నుంచి అన్నాసాలై మీదుగా తాంబరం వరకూ 60 సిటీ బస్సులు, టినగర్, ఎగ్మూరు మీదుగా తాంబరం వరకు 20 సిటీ బస్సులు, గిండి నుంచి కీలంబాక్కం వరకు 10 సిటీ బస్సులు, కొరుక్కుపేట నుంచి తాంబరం వరకు 20 సిటీ బస్సులు, ప్యారీస్ కార్నర్ నుంచి గూడువాంజేరి వరకు 20 సిటీ బస్సులు, టినగర్ నుంచి గూడువాంజేరికి 10 సిటీ బస్సులు అదనంగా నడిపినట్లు మహానగర రవాణా సంస్థ అధికారులు ప్రకటించారు. అయితే తాంబరం మార్గంలో చాలినన్ని బస్సులు సకాలంలో రాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. టి.నగర్, బ్రాడ్వే, కోయంబేడు ప్రాంతాల నుంచి తాంబరం వైపు వెళ్లే ప్రయాణికులంతా సకాలంలో బస్సులు రాకపోవడంతో ఆటోలు, టాక్సీలను ఆశ్రయించారు. నగరంలోని పలు చోట్ల ఆదివారం సాయంత్రం వరకూ ఇదే పరిస్థితి కొనసాగింది.


సెల్‌ఫోన్, చోరీలకు పాల్పడిన 31 మంది అరెస్ట్

పెరంబూర్, ఫిబ్రవరి 25: నగరంలో సెల్‌ఫోన్లు, చోరీలకు పాల్పడుతున్న 31 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ ఉత్తర్వులో పోలీసులు 'డ్రైవ్ అగనెస్ట్ క్రైమ్ అఫెండర్స్' అనే పేరుతో తనిఖీలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఈనెల 18 నుంచి 24వ తేది వరకు సెల్‌ఫోన్లు ఇతర చోరీలకు పాల్పడిన ఘటనల్లో 21 కేసులు నమోదు చేసి 31 మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 3 సవర్ల నగలు, 4 సెల్‌ఫోన్లు, రూ.50 వేల విలువైన పరికరాలు, కాపర్ వైర్లు, మోటరు పంపులు, రూ.2,69,500, రెండు మోటరు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే, ఈనెల 18 నుంచి 24వ తేది వరకు మోటరు సైకిళ్ల చోరీ ఘటనల్లో 3 కేసులు నమోదు చేసి ముగ్గురిని అరెస్ట్ చేశారు. వారినుంచి మూడు మోటరు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు నగర పోలీసు శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

చట్టసభల్లో కుమ్మరులకు ప్రాధాన్యం కల్పించాలి

● రాష్ట్ర మట్టిపాత్రల కార్మికుల సంఘం డిమాండ్

ప్యారీస్, ఫిబ్రవరి 25: రాష్ట్రవ్యాప్తంగా సుమారు 40 లక్షలమందికి పైగా ఉన్న కుమ్మరుల సామాజికవర్గానికి చెందిన ప్రజలు ఓటు హక్కు కలిగి ఉన్నారని, రాష్ట్రప్రభుత్వం దీన్ని దృష్టిలో ఉంచుకొని చట్టసభల్లో ప్రాధాన్యం కల్పించాలని తమిళనాడు మట్టిపాత్రల తయారీ కార్మికుల సంఘ వ్యవస్థాపకుడు సేమా నారాయణన్ డిమాండ్ చేశారు. ఈ సంఘం రాష్ట్రస్థాయి నిర్వాహకుల సమావేశం ఆదివారం టి.నగర్ సారంగపాణి వీధిలోని పద్మావతి వెంకటేశ్వర మహల్‌లో సేమా నారాయణన్ అధ్యక్షతన జరిగింది. అన్ని జిల్లాలకు చెందిన నిర్వాహకులు హాజరైన ఈ సమావేశం మొత్తం 10 తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించింది. రుతుపవనాల సీజన్‌లో ఉపాధి కోల్పోతున్న మట్టిపాత్రల తయారీ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా అందిస్తున్న రూ.5,000 ఆర్థికసాయాన్ని రూ.10 వేలకు పెంచాలని కోరారు. పొంగల్ పండుగ సందర్భంగా అర్హులైన రేషన్‌కార్డుదారులకు చౌక దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న సరుకులతో పాటు మట్టి కుండ, మట్టి పొయ్యి కూడా పంపిణీ చేసి తమ వృత్తిని ప్రోత్సహించాలని కోరారు. లోక్‌సభ ఎన్నికల్లో కుమ్మరులకు తగిన సహాయ సహకారాలు ప్రకటించే రాజకీయ పార్టీకే తాము మద్దతు ఇస్తామని నారాయణన్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణపతి, కోశాధికారి మహేష్‌కన్నన్, ఆర్గనైజర్ ఎస్ఎం పళని, మహిళా విభాగ రాష్ట్ర అధ్యక్షురాలు సరస్వతి అన్బు, విద్యార్థి విభాగం అధ్యక్షుడు కె.ఆనందన్ తదితరులు ప్రసంగించారు.



కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న సేమా నారాయణన్

పార్లమెంటు ఎన్నికలకు అన్నాడీఎంకే సిద్ధం

● మాజీ మంత్రి సెల్లూరు రాజు

పెరంబూర్, ఫిబ్రవరి 25: పార్లమెంటు ఎన్నికలను యుద్ధంలా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నాడీఎంకే మాజీ మంత్రి సెల్లూరు రాజు చెప్పారు. మదురైలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ... సైనికులను సిద్ధం చేసినట్లు కార్యకర్తలను పార్టీ ప్రధాన కార్యదర్శి సిద్ధం చేశారన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో కూటమిపై నిర్ణయం తీసుకొనేందుకు పళనిస్వామికి పూర్తి అధికారం అప్పగించామన్నారు. డీఎంకే కూటమిలోని పార్టీలు అన్నాడీఎంకే కూటమిలోకి వచ్చేందుకు చర్చలు జరుతున్నాయని తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైకు సంయమనం అవసరమని, ఆయన మాటలపై ముస్లింలు ఆగ్రహంతో ఉన్నారన్నారు. ఒ.పన్నీర్‌సెల్వం నాయకుడిలా కాకుండా స్టేజ్ స్పీకర్‌లా వ్యవహరిస్తున్నారని, పార్టీ నుంచి వీడిన వారి వల్ల తమకు ఎలాంటి నష్టం లేదని సెల్లూరు రాజు తెలిపారు.

నేడు మంత్రి పెరియస్వామి కేసుపై తీర్పు

పెరంబూర్, ఫిబ్రవరి 25: మంత్రి ఐ.పెరియస్వామికి వ్యతిరేకమైన కేసులో సోమవారం మద్రాసు హైకోర్టు తీర్పు వెలువరించనుంది. 2006-11 మధ్య డీఎంకే పాలనలో హౌసింగ్ బోర్డు శాఖ మంత్రిగా ఉన్న పెరియస్వామి, ప్రస్తుతం సహకార శాఖ మంత్రిగా వ్యవహరిస్తున్నారు. 2008లో తమిళనాడు హౌసింగ్ బోర్డుకు సొంతమైన గృహాన్ని, దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి భద్రతాదారుడిగా పనిచేస్తున్న పోలీసు అధికారి గణేశన్‌కు అక్రమంగా కట్టబెట్టారనే ఆరోపణలు రాగా, 2012 అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో కేసు నమోదైంది. ఈ కేసు నుంచి పెరియస్వామిని విడుదల చేస్తూ 2023 మార్చిలో ఎంపీ, ఎమ్మెల్యేలపై ఉన్న కేసులు విచారిస్తున్న ప్రత్యేక కోర్టు ఉత్తర్వులు జారీచేసింది.వాటిని పునః పరిశీలించాలని కోరుతూ, మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి ఎన్.ఆనంద్ వెంకటేశ్ సుమోటా కేసుగా స్వీకరించారు. ఈ కేసు విచారణ సమయంలో అవినీతి నిరోధక శాఖ తీరును ప్రశ్నించిన న్యాయమూర్తి, ఈ కేసు తీర్పు తేది ప్రకటించకుండా వాయిదావేశారు. ఈ కేసులో సోమవారం ఉదయం 10.30 గంటలకు న్యాయమూర్తి తీర్పు వెలువరించనున్నారు.

పొంగల్ కానుక... పొందని వారి వివరాలు సమర్పించండి: హై కోర్టు

ప్యారీస్, ఫిబ్రవరి 25: పొంగల్ పండుగ సందర్భంగా కుటుంబ కార్డుదారులకు రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేసిన నగదు పొందని వారి వివరాలతో నివేదిక సమర్పించాల్సిందిగా రాష్ట్రప్రభుత్వానికి మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. తమిళుల సంప్రదాయ పండుగ పొంగల్ సందర్భంగా కుటుంబ కార్డుదారులకు రూ.1,000 నగదు, బియ్యం, చక్కెర, చెరుకుగడతో కూడిన కానుకను రాష్ట్రప్రభుత్వం చౌక దుకాణాల ద్వారా పంపిణీ చేసింది. ఈ కానుకకు అర్హులైన రేషన్ కార్డుదారులకు చౌక దుకాణాల సిబ్బంది ముందుగానే టోకెన్లను ఇంటింటికీ వెళ్లి అందించారు. రాష్ట్రవ్యాప్తంగా పొంగల్ నగదు కానుక పంపిణీ ప్రభుత్వం నిర్ణయించిన గడువు తీరడంతో మిగిలిన నగదును రేషన్ సిబ్బంది ప్రభుత్వానికి అప్పగించారు. ఈ నేపథ్యంలో, రామనాథపురానికి చెందిన రాధాకృష్ణన్, తనకు పొంగల్ నగదు కానుక పంపిణీ చేయలేదని మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అందులో... తమ ప్రాంతంలో టోకెన్లు పొందిన పలువురికి సంబంధిత రేషన్ దుకాణం సిబ్బంది నగదు కానుక పంపిణీ చేయలేదని, దీనిపై విచారణ జరపాలని కోరారు. ఈ పిటిషన్‌ను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎస్వీ గంగాపూర్‌వాలా, న్యాయమూర్తి భరత్ చక్రవర్తిలతో కూడిన ప్రథమ ధర్మాసనం సమక్షంలో విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫు హాజరైన న్యాయవాది, రాష్ట్రవ్యాప్తంగా సుమారు కోటి మందికి పైగా పొంగల్ నగదు కానుక పంపిణీ చేసినట్లు సామాజిక మాధ్యమాల్లో వార్తలు ప్రసారమయ్యాయని అయితే, పిటిషనర్‌కు ఈ నగదు అందలేదని వాదించారు. ఇరుతరఫు వాదనల అనంతరం పొంగల్ నగదు కానుక పొందని వారి వివరాలతో నివేదిక దాఖలు చేయాల్సిందిగా రాష్ట్రప్రభుత్వానికి ఉత్తర్వులు జారీ చేసిన న్యాయస్థానం, తదుపరి విచారణ ఏప్రిల్ 12కు వాయిదా వేసింది.

మత్తు మాత్రల విక్రయం: ఇద్దరు రౌడీల అరెస్ట్

ప్యారీస్, ఫిబ్రవరి 25: స్థానిక తండయార్‌పేటలో మత్తుమాత్రలు విక్రయించిన ఇద్దరు రౌడీలను అదుపులోకి తీసుకున్న పోలీసులు, వారి నుంచి 150 గ్రాముల గంజాయి, 300 మత్తుమాత్రలు, రెండు కత్తులు, మోటర్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన అజిత్, వినోద్‌పై నగరంలోని పలు పోలీస్‌స్టేషన్లలో పలు కేసులు నమోదై ఉన్నాయి. వీరిని శనివారం రాత్రి అరెస్ట్ చేసి న్యాయమూర్తి సమక్షంలో హాజరుపర్చిన అనంతరం రిమాండ్‌కు తరలించారు.

పెయిన్ కిల్లర్ మందులు...

ఉత్తర చెన్నైలో మత్తు కోసం యువకులకు పెయిన్ కిల్లర్ మందులు విక్రయించిన కేసులో హరియాణా రాష్ట్రం గురుగ్రామ్ జిల్లాకు చెందిన అజయ్‌ఎడ్వర్డ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. కొడుంగైయూర్‌లో గత డిసెంబరులో హరియాణా రాష్ట్రం నుంచి కొరియర్ ద్వారా దిగుమతి చేసుకున్న పెయిన్ కిల్లర్ మందులను విక్రయిస్తూ పది మంది ఉత్తరాది యువకులకు పోలీసులకు పట్టుబడ్డారు. ఈ వ్యవహారంలో ముఠా నాయకుడిగా వ్యవహరించిన అజయ్ ఎడ్వర్డ్ పోలీసుల కళ్లు గప్పి స్వగ్రామానికి పారిపోయాడు. అతని కోసం గాలించిన పోలీసులు చివరకు హరియాణా వెళ్లి అక్కడ పోలీసుల సహకారంతో అతన్ని అరెస్ట్ చేసి నగరానికి తీసుకొస్తున్నారు.

రైలు పట్టాలపై లారీ బోల్తా: డ్రైవర్ మృతి

ప్యారీస్, ఫిబ్రవరి 25: కేరళ రాష్ట్రం నుంచి తూత్తుకుడికి ప్లైవుడ్ లోడుతో బయల్దేరిన ఓ లారీ సెంగోట్టై సమీపంలో అర్ధరాత్రి పట్టాలు దాటుతుండగా బోల్తాపడింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఆ సమయంలో కేరళ వైపునకు వెళుతున్న రైలుకు వృద్ధ దంపతులు టార్చిలైటు చూపించి నిలిపివేయడంతో పెనుముప్పు తప్పింది. తిరునల్వేలి నుంచి ముక్కూడల్ ప్రాంతానికి చెందిన మణికంఠన్ (34) కేరళలో ప్లైవుడ్ ఎక్కించుకొని లారీతో తూత్తుకుడికి బయల్దేరాడు. క్లీనర్‌గా పెరుమాళ్ (28) ఆయన వెంట ఉన్నారు. ఆ లారీ శనివారం అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో సెంగోట్టై సమీపంలో ఉన్న తమిళనాడు - కేరళ సరిహద్దుల్లో పట్టాలు దాటే సమయంలో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో డ్రైవర్ మణికంఠన్ అక్కడికక్కడే మరణించగా, క్లీనర్ పెరుమాళ్‌కు స్వల్పగాయాలయ్యాయి. ఈ నేపథ్యంలో, కేరళ రాష్ట్రంలో ఆర్డిన్‌కాల్‌లో ఆదివారం నిర్వహించిన పొంగల్ వేడుకల్లో పాల్గొనేందుకు సెంగోట్టై పులియూర్‌కు చెందిన షణ్ముగయ్య (63), ఆయన భార్య ఓ ప్రైవేటు బస్సులో వస్తూ రైలుపట్టాలపై లారీ బోల్తాపడిన విషయాన్ని గుర్తించారు. ఆ సమయంలో ఆ మార్గంలో ఓ రైలు రావడం గుర్తించి వెంటనే టార్చిలైటు వెలుగు చూపించి రైలును ఆపారు. కాగా, లారీ బోల్తాపడిన ఘటనపై అందిన సమాచారంతో పులియూర్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, రైల్వే పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని లారీని ఆ ప్రాంతం నుంచి తొలగించారు. డ్రైవర్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని తెన్‌కాశి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చెరువులో మునిగి తండ్రీకుమార్తె ...

ప్యారీస్, ఫిబ్రవరి 25: చెంగల్పట్టు జిల్లా మరమలై నగర్ సమీపంలో ఉన్న చెరువులో స్నానానికి వెళ్లిన తండ్రీకుమార్తె నీటమునిగి మృత్యువాతపడ్డారు. మరమలైనగర్ సమీపంలోని వివేకానంద నగర్‌కు చెందిన మదన్ (38) ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్నారు. సెలవు రోజైన శనివారం సాయంత్రం ఆయన తన కుమార్తె ధన్య (5), పక్కింట్లో ఉన్న మరో ముగ్గురు పిల్లలతో కలసి మనంగాట్టూర్ చెరువులో స్నానానికి వెళ్లారు. అందరు చెరువులో దిగి సరదాగా స్నానం చేస్తున్న సమయంలో ఊహించని విధంగా ధన్య నీటమునిగింది. కుమార్తెను కాపాడే ప్రయత్నంలో మదన్ కూడా నీటమునిగాడు. సమాచారం తెలిసి చెరువు వద్దకు చేరుకున్న గ్రామస్తులు ధన్య మృతదేహాన్ని వెలికి తీశారు. మరమలైనగర్ అగ్నిమాపక సిబ్బంది రబ్బరు బోటు ద్వారా చెరువులో సుమారు రెండు గంటలు గాలించి మదన్ మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

రోడ్డు ప్రమాదంలో ...

పెరంబూర్, ఫిబ్రవరి 25: చెంగల్పట్టు జిల్లా మహాబలిపురం సమీపంలో ద్విచక్రవాహనం. ప్రభుత్వ బస్సు ఢీకొని ఘటనలో ఇద్దరు మృతిచెందారు. కడుంబాడికి చెందిన శంకర్(47), బాలు(50) ఆదివారం మధ్యాహ్నం ద్విచక్రవాహనంపై మహాబలిపురం వెళ్తుండగా ప్రభుత్వ బస్సును ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రగాయాలతో సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. మహాబలిపురం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

కొల్లిడం నదిలో ముగ్గురు విద్యార్థుల గల్లంతు

పెరంబూర్, ఫిబ్రవరి 25: అరియలూరు జిల్లా తిరుమానూర్ కొల్లిడం నదిలో గల్లంతైన ముగ్గురు విద్యార్థుల కోసం గాలిస్తున్నారు. అంబత్తూర్‌కు చెందిన 8 మంది విద్యార్థులు చెన్నై నుంచి తంజావూరులో జరిగిన కార్యక్రమానికి హాజరయ్యారు. తిరుగు ప్రయాణంలో కొల్లిడం నదిలో స్నానం చేసేందుకు దిగారు. వారిలో పచ్చయప్పన్ అనే విద్యార్థి లోతైన ప్రాంతానికి వెళ్లి మునగి పోవడాన్ని గమనించిన సహచర విద్యార్థులు రక్షించేందుకు యత్నించే క్రమంలో మరో ఇద్దరు విద్యార్థులు గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బందితో అక్కడికి చేరుకొని గల్లంతైన విద్యార్థుల కోసం గాలిస్తున్నారు.



రాఘవ లారెన్స్

అభిమానుల చెంతకు రాఘవ లారెన్స్

తన అభిమానులను కలుసుకునేందుకు నృత్య దర్శకుడు, హీరో, దర్శకుడు, నిర్మాత రాఘవ లారెన్స్ రాష్ట్ర పర్యటనకు శ్రీకారం చుట్టారు. ఆదివారం నుంచి పర్యటనను ఆయన ప్రారంభించారు. తొలుత ఆయన విల్లుపురంలోని అభిమానులను కలుసుకుని వారితో ఫొటోలు దిగి వారిని సంతోష పెడతారు. ఈ విషయంపై ఆయన శనివారం తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్ట్ చేశారు. 'అభిమానులను కలుసుకునేందుకు ఆదివారం నుంచి రాష్ట్ర పర్యటన చేపడుతున్నా' అని పేర్కొన్నారు. ఇదిలాఉండగా, అభిమానుల చెంతకే రాఘవ లారెన్స్ వెళ్లడానికి కారణం లేకపోలేదు. గత యేడాది చెన్నైలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన అభిమానులు.. తనతో ఫొటో దిగి తిరిగి సొంతూర్లకు వెళుతూ ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన ఆయనను తీవ్రంగా కలచివేసింది. అప్పటి నుంచి ఓ నిర్ణయం తీసుకున్న లారెన్స్.. చెన్నైలో జరిగే తన చిత్రాల ఆడియో, ట్రైలర్, విజయోత్సవాలకు వారిని ఆహ్వానించడం లేదు. ఈ ఘటన తీవ్ర మనోవేదనకు గురిచేసిందని అందువల్ల అభిమానుల చెంతకు తానే వస్తానని ప్రకటించారు. ఆ ప్రయాణాన్ని ఆయన ఆదివారం నుంచి ప్రారంభించారు.


సోనా హైదర్ 'స్మోక్' మోషన్ పోస్టర్ రిలీజ్



జనని విజయ కుమార్ - సోనా హైదర్

అజిత్ కుమార్ హీరోగా నటించిన 'పూవెల్లాం ఉన్ వాసమ్' సినిమా ద్వారా తమిళ చిత్రపరిశ్రమకు పరిచయమైన నటి సోనా... రెండు దశాబ్దాలుగా ఇండస్ట్రీలో కొనసాగుతున్నారు. తాజాగా తన జీవితంలో జరిగిన అనేక సంఘటనలను ఆధారంగా చేసుకుని ఆమె 'స్మోక్' పేరుతో వెబ్ సిరీస్‌ను నటించారు. ఈ వెబ్ సిరీస్ ఫస్ట్‌లుక్, మోషన్ పోస్టర్లను తాజాగా విడుదల చేశారు. '14 యేళ్ల ప్రాయంలో నేను ఒక అందమైన జీవితం వైపు ప్రయాణిస్తుంటే కానీ, ఓ చేయి నన్ను పట్టుకుని నెట్టేసింది. నేను మాట్లాడేందుకు ఏ ఒక్కరూ లభించలేదు. నేను ఏదో జీవిస్తున్నాను' అంటూ డైలాగులతో ఈ మోషన్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఇందులో 14 యేళ్ల సోనా హైదర్‌గా జనని విజయకుమార్ నటించారు. ఈ వెబ్ సిరీస్‌కు కథ, మాటలను సోనా స్వయంగా సమకూర్చి దర్శకత్వం వహించారు. యూనిక్ ప్రొడక్షన్స్ షార్ట్‌ఫ్లిక్స్‌తో కలిసి ఆమె సొంతంగా తెరకెక్కిస్తున్నారు. ఇందులో నలుగురు ప్రముఖ సినీ నటులు నటించగా, వారి వివరాలతో ఈ వెబ్ సిరీస్ స్ట్రీమింగ్ అయ్యే వివరాలను త్వరలోనే వెల్లడించనున్నారు.

చిత్రజ్యోతి



'ఇండియన్-2'లో కమల హాసన్

మే నెలాఖరులో 'ఇండియన్-2'!

విశ్వనటుడు కమల హాసన్, సెన్సేనల్ డైరెక్టర్ ఎస్.శంకర్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'ఇండియన్-2' చిత్రం మే నెలాఖరులో విడుదలకు సిద్ధమవుతోంది. గతంలో వచ్చిన బ్లాక్‌బస్టర్ హిట్ మూవీ 'ఇండియన్'కు ఇది సీక్వెల్. ఈ రెండో భాగం చిత్రీకరణ 2019లో ప్రాంభమైంది. అయితే, కరోనా మహమ్మారి, నిర్మాత - దర్శకుడు మధ్య తలెత్తిన వివాదం, షూటింగ్ స్పాట్‌లో జరిగిన క్రేన్ ప్రమాదాలు ఇలా పలు కారణాలతో సినిమా షూటింగ్ జాప్యమైంది. ఇపుడు ఎట్టకేలకు నిర్మాణం పూర్తి చేసుకుని వేసవిలో విడుదలై సందడి చేయనుంది. ఈ మూవీలో కమల్‌తో పాటు కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీత్‌సింగ్, ఎస్‌జే సూర్య, సిద్ధార్థ్, బాబి సింహా సహా పలువురు ప్రముఖ నటులు నటించారు. నిర్మాణాంతర కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ మూవీ మే 23 లేదా 30వ తేదీల్లో విడుదలయ్యే అవకాశం ఉందని కోలీవుడ్ వర్గాల సమాచారం. తమిళంతో పాటు తెలుగు, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో విడుదలకానుంది.



వాణి భోజన్

విజయ్‌కు రాజకీయాల్లో ఓ ఛాన్సివ్వాలి

● నటి వాణి భోజన్

రాజకీయ పార్టీని స్థాపించిన అగ్రహీరో విజయ్‌కు ఓ అవకాశం ఇవ్వాలని హీరోయిన్ వాణి భోజన్ అభిప్రాయపడ్డారు. ఆమె తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ... 'ప్రతి ఒక్కరూ రాజకీయాల్లో వస్తారా అని ప్రశ్నిస్తున్నారు. నిజానికి మంచి చేయాలనే భావించే వారు రాజకీయాల్లోకి రావొచ్చు. తమిళగ వెట్రి కళగం పేరుతో రాజకీయ పార్టీని స్థాపించిన హీరో విజయ్‌కు ఒక అవకాశం ఇవ్వాలి. నేనే ఒక వెబ్ సిరీస్‌లో నటించే సమయంలో రాజకీయాల్లోకి రావాలన్న కోరిక కలిగింది. మసాలా సినిమాను చూడటం కంటే మంచి సందేశం ఉన్న చిత్రాలను చూడడంలో ఎంతో వ్యత్యాసం ఉంది. నేను ఒక మంచి సందేశాత్మక చిత్రంలో నటిస్తున్నాను అది త్వరలోనే విడుదలవుతుంది' అని పేర్కొన్నారు. కాగా, 'ఓ మై కడవులే', 'లాకప్2, 'మిరల్', 'పాయుం పులి నీ ఎనక్కు' వంటి అనేక చిత్రాల్లో నటించిన వాణి భోజన్.. బుల్లితెర నుంచి బిగ్‌స్క్రీన్‌కు వచ్చారు. రాధామోహన్ దర్శకత్వంలో వచ్చిన 'చట్నీ సాంబార్' అనే సీరియల్‌లో నటించి మంచి గుర్తింపు పొందారు. ఆ తర్వాత మూవీ ఇండస్ట్రీలోకి ప్రవేశించి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.



బోట్ హౌస్‌లో పర్యాటకులు

ఊటీలో పర్యాటకుల సందడి

పెరంబూర్, ఫిబ్రవరి 25: ప్రసిద్ధి పర్యాటక కేంద్రం ఊటీ ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది. కొద్దిరోజులుగా రాష్ట్రంలో ఎండ తీవ్రత అధికంగా ఉంటోంది. ఈరోడ్, నామక్కల్, మదురై సహా ఐదు జిల్లాల్లో శనివారం 38 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో, ఆదివారం సెలవు దినం కావడంతో ప్రజలు చల్లటి ప్రాంతాలకు విహార యాత్రలకు వెళుతున్నారు. అలాగే, ఊటీ పర్యాటకులతో కిటకిటలాడుతోంది. చల్లటి వాతావరణంలో పర్యాటక ప్రాంతాలు, బోట్ క్లబ్‌ల్లో ప్రజలు బోట్లలో షికారు చేస్తూ ఆనందంగా సేదతీరారు.

సీనియర్ నిర్మాత వి.మహేష్ కన్నుమూత



వి.మహేష్ (ఫైల్‌ఫోటో)

చెన్నై, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సీనియర్ నిర్మాత, సినీ రచయిత, హైదరాబాద్‌లోని ఫిల్మ్ నగర్ హౌసింగ్ సొసైటీ కమిటీ సభ్యుడు వి.మహేష్ (85) శనివారం రాత్రి చెన్నైనగరంలో గుండెపోటుతో మరణించారు. ఇంట్లోని బాత్రూమ్‌లో జారిపడటంతో ఆయనను హుటాహుటిన సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్ళగా, అప్పటికే ఆయన మృతి చెందినట్టు వైద్యులు ప్రకటించారు. 1975లో చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టిన ఆయన.. దాసరి నారాయణ రావు దర్శకత్వంలో ఎన్టీఆర్ హీరోగా 'మనుషులంతా ఒక్కటే' అనే చిత్రాన్ని 1976లో తెరకెక్కించారు. ఆ తర్వాత 'మహాపురుషుడు', 'సింహపురి సింహం', 'ముసుగుదొంగ' వంటి పలు చిత్రాలను నిర్మించారు. 'మనుషులంతా ఒక్కటే' చిత్రానికిగాను వి.మహేష్ నంది అవార్డును అందుకున్నారు. తన అన్నయ్య వి.వి.రాజేంద్రకుమార్‌తో కలిసి చిత్రాలకు ప్రచార సామాగ్రిని తయారు చేసే సంస్థ స్టూడియో రూప్ కళను ప్రారంభించిన ఆయన.. ఆదిత్య చిత్ర పేరుతో నిర్మాణ సంస్థను నెలకొల్పారు. అలాగే, శ్రీ వేంకటేశ్వర భక్తి చానెల్‌లో ప్రసారమైన 'హరి భక్తుల కథలు' అనే ధారావాహికకు నిర్మాత, రచయిత ఆయనే కావడం గమనార్హం. అవివాహితుడైన వి.మహేష్ స్వస్థలం నెల్లూరు జిల్లా కొరుటూరు. ఆయన అంత్యక్రియలు చెన్నైలో సోమవారం ముగిశాయి. కాగా, నిర్మాత. వి.మహేష్ మరణ వార్తను తనకు బంధువులు చెప్పారని ఫిల్మ్ నగర్ హౌసింగ్ సొసైటీ కార్యదర్శి కాజా సూర్యనారాయణ వెల్లడించారు. ఆయన మృతిపట్ల దక్షిణ భారత వాణిజ్య మండలి పూర్వాధ్యక్షుడు, చెన్నై తెలుగు నిర్మాతల మండలి కార్యదర్శి, సీనియర్ నిర్మాత కాట్రగడ్డ ప్రసాద్‌తో పాటు పలువురు సినీ ప్రముఖులు తమ ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని వ్యక్తం చేశారు.

నేడు కలైంజర్ స్మారక స్థలం ప్రారంభం

అడయార్, ఫిబ్రవరి 25: మెరీనా బీచ్‌లో కొత్తగా నిర్మించిన మాజీ ముఖ్యమంత్రి, దివంగత కలైంజర్ కరుణానిధి, ఆధునికీకరించిన దివంగత అన్నాదురై స్మారక మందిరాలను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సోమవారం ప్రారంభించనున్నారు. రాత్రి 7 గంటలకు జరిగే కార్యక్రమంలో సీఎంతో పాటు మంత్రులు కూడా హాజరవుతారు. 2018, ఆగస్టు 7వ తేదీన కలైంజర్ కన్నుమూసిన విషయం తెల్సిందే. ఆయన పార్థివదేహాన్ని మెరీనా బీచ్‌లోని అన్నా సమాధి వద్ద ఖననం చేశారు. ఇక్కడే అన్నా, కలైంజర్ సమాధులు 8.57 ఎకరాల్లో ఉన్నాయి. 2021లో డీఎంకే అధికారంలోకి రాగానే కలైంజర్‌కు స్మారక స్థలం నిర్మించేందుకు ప్రభుత్వం తరపున నిధులను కేటాయించారు. ఈ స్థలం నిర్మాణ పనులను ప్రజా పనుల శాఖ ఆధ్వర్యంలో పూర్తి చేశారు. అలాగే, అన్నా సమాధిని కూడా ఆధునికీకరించేందుకు నిధులు కేటాయించారు. జూన్ 3వ తేదీన కలైంజర్ జయంతి వేడుకలు జరగనున్నాయి. ఈలోగా స్మారక స్థలాన్ని ప్రారంభించాలని సీఎం స్టాలిన్ నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఈ రెండు స్మారక స్థలాలను సోమవారం రాత్రి 7 గంటలకు ప్రారంభించేలా ఏర్పాట్లు చేశారు.

ఎన్ని కష్టాలొచ్చినా ప్రజలను ఆదుకుంటాం

తూత్తుకుడి సభలో సీఎం స్టాలిన్





తూత్తుకుడి సభలో మహిళా స్వయం సహాయక బృందం నిర్వాహకురాలికి సహకార శాఖ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ - తూత్తుకుడిలో విన్‌ఫాస్ట్ కర్మాగారం భూమిపూజ కోసం వియత్నాం నుంచి వచ్చి బౌద్ధ భిక్షువులతో కరచాలనం చేస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

చెన్నై, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): గత మూడేళ్లుగా కేంద్రం నుంచి సక్రమంగా నిధులు విడుదల కాకపోయినా ఉన్న ఆర్థిక వనరులతోనే ప్రజలను ఆదుకుంటున్నామని, ఎన్ని కష్టాలొచ్చినా వారికి అండగా నిలుస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అన్నారు. ఎనిమిది జిల్లాల్లో వరద, తుఫాను బాధితులకు నిధులు మంజూరు చేయాలంటూ రాష్ట్రప్రభుత్వం పలుమార్లు విజ్ఞప్తి చేసినా కేంద్రం పట్టించుకోలేదని, అయినా తమ ప్రభుత్వం బాధితులను అన్ని విధాలా ఆదుకుందని చెప్పారు. ఇటీవల చెన్నై సహా ఎనిమిది జిల్లాల్లో తుఫాను, వరద పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొన్నామని, బాధితులను ఆర్థికంగా ఆదుకున్నామని చెప్పారు. తూత్తుకుడి, తిరునల్వేలి జిల్లాల్లో గత డిసెంబర్‌లో వర్షబీభత్సానికి గురైన బాధితులకు ఆర్థిక సహాయాలు అందించే కార్యక్రమం తూత్తుకుడిలో ఆదివారం ఉదయం జరిగింది. ఈ సభలో 2.21 లక్షలమంది బాధితులకు వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద రూ.423.95 కోట్ల సాయాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో సీఎం ప్రసంగిస్తూ... డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి జిల్లాలోనూ తాను పర్యటిస్తూ వివిధ శాఖల ఆధ్వర్యంలో సంక్షేమ పథకాల కింద లబ్ధిదారులకు సహాయాలు పంపిణీ చేస్తున్నానని, ఆ మేరకు ఈ యేడాదికి సంబంధించి తన సోదరి కనిమొళి ప్రాతినిధ్యం వహిస్తున్న తూత్తుకుడిలో ఏర్పాటు కావడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. గత డిసెంబర్ వర్షబీభత్సానికి నష్టపోయిన ప్రజలను ఆదుకునేందుకు కనిమొళి, తూత్తుకుడి జిల్లా మంత్రి గీతా జీవన్, మంత్రులు ఈవీ వేలు, ఉదయనిధి తూత్తుకుడిలోనే రోజుల తరబడి మకాం పెట్టారని, వారి సహాయక చర్యల వల్లే రెండు జిల్లాలు త్వరగా వరద పరిస్థితుల నుంచి బయట పడ్డాయన్నారు. ప్రజలకు కష్టాలొస్తే తమ ప్రభుత్వం వెంటనే ఆదుకుంటుందని చెప్పారు. ఇక తూత్తుకుడి జిల్లాను పారిశ్రామిక పరంగాను అభివృద్ధి చేయడానికి తమ ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, ఆ మేరకే సిలానత్తంలో రూ.4వేల కోట్లతో విన్‌ఫాస్ట్ ఎలక్ట్రికల్ వాహనాల తయారీ కర్మాగారానికి శంకుస్థాపన చేశానని తెలిపారు. ఇటీవల జరిగిన అంతర్జాతీయ పెట్టుబడిదారుల మహానాడులో మలేసియాకు చెందిన పెట్రోనాస్ సంస్థ రూ.30 వేల కోట్లతో తూత్తుకుడి జిల్లాలో పరిశ్రమలు స్థాపించేలా ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుందని తెలిపారు. ఈ కొత్త పరిశ్రమల వల్ల వేలాదిమంది నిరుద్యోగ యువకులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ప్రజల కోసం పాటుపడటమే తమ ధ్యేయమని, ఎన్ని అడ్డంకులు ఎదురైనా రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిపరుస్తామని స్టాలిన్ శపథం చేశారు.



ఎద్దును అణచడానికి ప్రయత్నిస్తున్న యువకులు

అట్టహాసంగా కల్లకుడి జల్లికట్టు

చెన్నై, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి జిల్లా కల్లకుడిలో ఆదివారం ఉదయం జల్లికట్టు సాహసక్రీడ ఆద్యంతం అట్టహాసంగా కొనసాగింది. ఎద్దులను అణచేందుకు యువకులు పోటీపడ్డారు. అదే సమయంలో వాడివాసల్ నుంచి రంకెలేస్తూ వచ్చిన సుమారు 600కు పైగా ఎద్దులు యువకులకు చిక్కనివ్వకుండా తప్పించుకుని యజమానులకు బహుమతుల పంట పండించాయి. ఉదయం 8 గంటల నుంచి 4 నాలుగు వరకు జరిగిన జల్లికట్టు ప్రేక్షకులను ఆద్యంతం అలరించింది. ఈ జల్లికట్టు క్రీడను ఆర్డీఓ శివసుబ్రమణియన్, లాల్గుడి డీఎస్పీ అజయ్ తంగం, తహసీల్దార్ మురుగన్ ప్రారంభించారు. తిరుచ్చి, కరూరు, పుదుకోట, తంజావూరు, పెరంబలూరు, అరియలూరు, తిరువారూరు, దిండుగల్ తదితర జిల్లాల నుండి తెప్పించిన సుమారు 700 ఎద్దులు పోటీలో పాల్గొన్నాయి. ఆ తర్వాత క్రీడా నిర్వాహకుల పరిశీలన, వైద్యుల పరీక్షల అనంతరం 450 మంది యువకులు మైదానంలో ప్రవేశించి రంకెలేస్తున్న ఎద్దులను అణచేందుకు పోటీపడ్డారు. ఈ పోటీల్లో గెలిచిన ఎద్దుల యజమానులకు, ఎద్దులను అణచివేసిన యువకులకు బంగారు నాణేలు, బీరువాలు, సైకిళ్లు, మంచాలు, ప్లాస్టిక్ కుర్చీలను బహుమతులుగా అందజేశారు. ఈ పోటీలను తిలకించేందుకు వచ్చిన వేలాదిమందికి పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.పోటీల్లో గాయపడినవారికి చికిత్సలందించేందుకు ప్రత్యేక వైద్య బృందాన్ని, అంబులెన్స్‌లను సిద్ధం చేసి ఉంచారు.

అన్నానగర్‌లో రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ ప్రారంభం

అడయార్, ఫిబ్రవరి 25: స్థానిక అన్నానగర్‌లో రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్, మెటర్నిటీ ఆస్పత్రిని ఆదివారం ఆ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, ప్రముఖ వైద్యుడు రమేష్ కంచర్ల ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవంలో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. చెన్నై నగరంలో ప్రారంభించిన ఇది మూడో హాస్పిటల్. ఇప్పటికే స్థానిక గిండి, షోళింగనల్లూరులో ఈ ఆస్పత్రులున్నాయి. కొత్తగా అన్నానగర్‌లో ప్రారంభించిన ఈ ఆస్పత్రి 80 పడకలు కలిగి ఉంది. రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ చైన్ లింక్ ఆస్పత్రుల్లో ఇది 19వ ఆస్పత్రి. 24 యేళ్ళుగా అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తున్న ఈ గ్రూపు అన్నానగర్ ఆస్పత్రిని అత్యాధునిక వైద్య సదుపాయాలతో నిర్మించినట్టు ఎండీ డాక్టర్ రమేష్ కంచర్ల వెల్లడించారు. ఇదే విషయంపై ఆయన విలేకరులతో మాట్లాడుతూ... రెండు దశాబ్దాలకు పైగా హైదరబాద్‌లో తమ ఆస్పత్రి వైద్య సేవలు అందిస్తోందన్నారు. హైదరబాద్ చుట్టుపక్కల జిల్లాల నుంచి రోగులను తీసుకొచ్చేందుకు ప్రత్యేక అంబులెన్స్ వ్యవస్థను కలిగివున్నట్టు తెలిపారు. చెన్నై వంటి మహానగరంలో తమ మూడో ఆస్పత్రిని ప్రారంభించి, నగరవాసులకు అంతర్జాతీయ స్థాయి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకుని రావడం సంతోషంగా ఉందన్నారు. దక్షిణ భారతదేశంలోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, విజయవాడ, చెన్నై, బెంగళూరుల్లో తమ ఆస్పత్రి సేవలను విస్తరించనున్నట్టు తెలిపారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విజయవాడ, వైజాగ్‌లో రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ ఉండగా, త్వరలోనే నెల్లూరు, కర్నూలు నగరాల్లో ప్రారంభించనున్నట్టు తెలిపారు. అదేవిధంగా వచ్చే నాలుగేళ్లలో ఇతర రాష్ట్రాలతో పాటు విదేశాల్లో కూడా ఆస్పత్రి సేవలను విస్తరిస్తామని చెప్పారు. తమ ఆస్పత్రిలో క్యాన్సర్ సహా అన్ని రకాల చికిత్సలకు వైద్యం అందిస్తామన్నారు. సీఎం ఆరోగ్య బీమా పథకం కింద కూడా వైద్యం చేస్తామని డాక్టర్ రమేష్ కంచర్ల పేర్కొన్నారు.



జ్యోతిప్రజ్వలనతో ఆసుపత్రిని ప్రారంభిస్తున్న ఎండీ డాక్టర్ రమేష్ కంచర్ల తదితరులు

సీటుతో సర్దుకు పోదామా... ఒంటరిగా పోటీచేద్దామా?

● అయోమయంలో ఎంఎన్‌ఎం అధినేత కమల్



చెన్నై, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో మక్కల్ నీదిమయ్యం (ఎంఎన్‌ఎం) డీఎంకే కూటమిలో చేరటం ఖాయమే అయినా సీట్ల పంపకంపై ఇరు పార్టీల నడుమ ఇంకా ప్రతిష్టంభన కొనసాగుతోంది. ప్రస్తుతానికి డీఎంకే కూటమిలోని చిన్నాచితక పార్టీలతో డీఎంకే అధిష్ఠానం ఏర్పాటు చేసిన కమిటీ సీట్ల సర్దుబాట్లపై చర్చలు జరుపుతోంది. ఇప్పటివరకు కొంగునాడు మక్కల్ దేశీయకట్చి, ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ పార్టీలకు తలా ఒక సీటును డీఎంకే కేటాయించింది. ప్రస్తుతం ఎండీఎంకేతో సీట్ల సర్దుబాట్లపై చర్చలు కొనసాగుతున్నాయి. ఆ నేపథ్యంలో ఇటీవలే అమెరికా నుంచి తిరిగొచ్చిన మక్కల్ నీదిమయ్యం నేత కమల హాసన్ ఎన్నికల పొత్తుపై త్వరలో శుభవార్తను ప్రకటిస్తానంటూ పార్టీ శ్రేణులకు తెలిపారు. అయితే నాలుగు రోజులు దాటినా ఆయన డీఎంకే కూటమితో పొత్తు ఖరారైనట్లు ఎలాంటి ప్రకటనలు చేయలేదు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కేటాయించనున్నట్లు సీట్లలో ఒక సీటును మక్కల్ నీదిమయ్యంకు కేటాయించాలని డీఎంకే అధిష్ఠానం భావిస్తోంది. ఆ ప్రకారం మక్కల్ నీదిమయ్యంకు ఒక సీటును మాత్రమే కేటాయించాలని నిర్ణయించినట్లు స్పష్టమవుతోంది. పార్టీ వర్గాల సమాచారం మేరకు కోయంబత్తూరు సీటును మక్కల్ నీదిమయ్యంకు కేటాయిస్తారని తెలుస్తోంది. డీఎంకే కూటమిలో రెండు లోక్‌సభ నియోజకవర్గాలు, ఒక రాజ్యసభ సీటును కేటాయించాలని కమల్ ప్రతిపాదన చేశారు. అయితే డీఎంకే అధిష్ఠానం మిత్రపక్షమైన కాంగ్రెస్‌కు మునుపటిలా 10 సీట్లు కేటాయించి, వాటిలో ఒక సీటును మక్కల్‌నీదిమయ్యంకు కేటాయించమంటూ ఆదేశిస్తున్నట్లు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఒక్కసీటుతో సర్దుకుపోవాలా? లేక ఎప్పటిలాగే లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరి పోరుకు దిగాలా? అంటూ పార్టీ నేత కమల్ అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నట్లు సమాచారం.

29న విదేశీపయనం...

ఇదిలా ఉండగా కమలహాసన్ మళ్ళీ విదేశీ పర్యటనకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 29న ఆయన విదేశీ పర్యటనకు బయలుదేరుతున్నట్లు ఎంఎన్‌ఎం నేతలు చెబుతున్నారు. ఈలోగా డీఎంకే కూటమిలో సీట్ల సర్దుబాట్లు ఖరారవుతాయని తెలుస్తోంది.